ప్రజాశక్తి
సోమవారం 13 జనవరి 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

సచివాలయాల పునర్ వ్యవస్థీకరణ

- మూడు కేటగిరీలుగా విభజనకు ప్రభుత్వం కసరత్తు
- రేషనలైజేషన్‌లో ఉద్యోగులకు తప్పని స్థాన చలనం
- మార్పులపై ఉద్యోగుల్లో దిగులు, గుబులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థలో సమూల మార్పులు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు రెండ్రోజుల క్రితం సిఎం చంద్రబాబు సమక్షంలో జరిగిన సమీక్షలో ఉన్నతాధికారులు ఇందుకు సంబంధించి కొన్ని కీలకమైన ప్రతిపాదనలు చేశారు. ఈ మార్పులకు సంబంధించి ఉద్యోగ వర్గాల్లో కొంత అయోమయం ఏర్పడింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో రేషనలైజేషన్ చేయడం వల్ల ఒక చోట పనిచేస్తున్న వారికి మరో చోటకు వెళ్లాల్సి ఉంటుంది.కొంత మందికి ఆయా శాఖల్లో ఎటువంటి స్థానం లభిస్తుందనేదీ ప్రశ్నార్థకంగా మారింది.



ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 12 వేల సచివాలయాలున్నాయి. వీటిల్లో నాలుగేళ్ల క్రితం దాదాపు 14 వేల మంది ఉద్యోగులు నియమితులయ్యారు. వీరిలో దాదాపు నాలుగు వేల మంది వేర్వేరు ఉద్యోగాలకు వెళ్లిపోయారు. మరికొంత మంది దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్నారు. సచివాలయాల వ్యవస్థ ద్వారా పాలనా యంత్రాంగం ప్రజలకు చేరువైంది. గ్రామ సచివాయాల్లో 11 మంది, పట్టణ ప్రాంతాల్లో 10 మంది ఉద్యోగులు మొత్తం 35 శాఖల పరిధిలో 540 రకాల సేవలు అందించారు. 2019లో ఎపిపిఎస్‌సి ద్వారా ఎంపికైన వీరిని మూడేళ్ల తర్వాత పర్మినెంట్ చేశారు. ప్రస్తుతం ఉద్యోగులకు గరిష్టం రూ.32 వేలు, కనిష్టంగా రూ.28 వేలు వేతనం లభిస్తోంది. వీరంతా పట్టభద్రులు, పీజీలు చేసిన వారే. రాతపరీక్షల ద్వారా ఎంపికైన వీరు ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్‌కు ఎక్కువ కాకుండా, రికార్డు అసిస్టెంట్‌కు తక్కువ కాకుండా ఉండే పోస్టుల్లో ఉన్నట్టు చెబుతున్నారు.

ఈ వ్యవస్థను గత ప్రభుత్వం ప్రవేశపెట్టినా ఉద్యోగులకు సరైన హోదా లభించలేదనే విమర్శలున్నాయి. ఇంజినీరింగ్ అసిస్టెంట్లుగా పనిచేసే వారికి కనీసం జూనియర్ ఇంజనీర్ స్థాయి హోదా ఇచ్చి వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులలో నియమించి జెఈ లేదా ఎఈ స్కేలు వర్తింపజేయాలని బీటెక్, బిఈ, ఎంటెక్ అర్హత కలిగిన వారు కోరుతున్నారు. అయితే మున్సిపాల్టీల పరిధిలో పనిచేసే శానిటరీ అసిస్టెంట్‌లు తమకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా నియమించాలని కోరుతున్నారు. అంతేగాక ప్రస్తుతం ఖాళీల భర్తీ కూడా చేపట్టలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేసే మార్పుల వల్ల తమకు మేలు జరుగుతుందా? ఇబ్బందులు వస్తాయా? అనే సందేహాలు ఉద్యోగుల్లో ఏర్పడ్డాయి.

ప్రస్తుతం సచివాలయాల సంఖ్యను కొంత కుదించే అవకాశం కన్పిస్తోంది. ఇప్పటికే మూడేళ్లుగా సచివాలయాల్లో ఏర్పడిన ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. 11 మంది ఉండాల్సిన సచివాయాల్లో ఐదారుగురు పనిచేస్తుండడంతో మిగతా వారిపై పనిభారం పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో 10 మంది ఉండాల్సిన సచివాలయాలో ఆరేడు మంది ఉన్నారు. అదనపు విదార్హతలున్న వారు ఉన్నత చదువులు, పోటీ పరీక్షల కోసం ఇప్పటికే ఉద్యోగం వదులుకుని వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ▶ 2లో

విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేయండి : సిపిఎం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా


సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్

విద్యుత్ వినియోగదారులపై సర్దుబాటు ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం వేస్తున్న భారాలను ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ కోరారు. ఇందులో భాగంగా విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో దహనం చేయాలని పిలుపునిచ్చారు. ఒకవైపు సర్దుబాటు చార్జీల పేరిట భారాలు మోపుతూ మరోవైపు స్మార్ట్ మీటర్లు బిగించి మరింత భారాలు ప్రజల నెత్తిన వేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని విమర్శించారు. ట్రూ ఆప్ ఛార్జీలను రద్దుచేయాలని, సర్దుబాటు చార్జీలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల బిగింపు నిలుపుదల చేయాలని, గత ప్రభుత్వం అదానీ దగ్గర సోలార్ విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలని, తీసుకున్న లంచాలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు.



8లో

ఆలోచింపజేసిన మట్టి మనిషి



3లో

జిఎంసి ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు


మాచర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

2లో

ప్రజల కోసం.. అవినీతి మరక లేకుండా..

- సమస్యలపై నిజాయితీగా పిడిఎఫ్ ఎమ్మెల్సీల పోరాటం
- శాసన మండలి, ఇతర వేదికలపై ప్రజాగళం
- ఆత్మీయ సమావేశాల్లో కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి- మాచర్ల, సత్తెనపల్లి

శాసనమండలి ఏర్పడిన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి ఇప్పటి వరకు 14 మంది పిడిఎఫ్ ఎమ్మెల్సీలుగా గెలిచారని, ఒక్క అవినీతి మరక లేకుండా, నిజాయితీగా పనిచేస్తూ ప్రజల కోసం తమ గళాన్ని శాసన మండలిలో వినిపిస్తున్నారని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుండి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ మాచర్ల పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో, సత్తెనపల్లిలోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ, పెన్షనర్స్, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, కార్మిక, ప్రజా సంఘాల ఆత్మీయ సమావేశాలు జరిగాయి. మాచర్లలో యుటిఎఫ్ నాయకులు నాసరరెడ్డి, సత్తెనపల్లిలో యుటిఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 2007లో ఉమ్మడి ▶ 2లో

ప్రజల కోసం.. అవినీతి మరక లేకుండా..

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలి ఏర్పాటైన తరువాత పట్టభద్రుల, ఉపాధ్యాయ స్థానాల నుండి స్వతంత్ర అభ్యర్థులుగా ఏడుగురం గెలిచామని, శాసనమండలిలో తమ వాణిని బలంగా వినిపించేందుకు ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్)గా ఏర్పడి అనేక సమస్యలపై ఉద్యమించామని చెప్పారు. నిజాయితీగా పనిచేస్తూ ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుండటం జరుగుతుందన్నారు. వెనకబడిన మాచర్ల నియోజకవర్గంలో అభివృద్ధి విద్య ద్వారానే సాధ్యమని, ఈ ప్రాంతంలో విద్యా సంస్థల అభివృద్ధికి తాను ఎన్నోమార్లు శాసనమండలి, బహిరంగ వేదికలపై మాట్లాడానని గుర్తు చేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిజి సెంటర్ ఏర్పాటుకు ప్రయత్నించగా ప్రొఫెసర్లు ఈ ప్రాంతానికి వచ్చేందుకు సుముఖత చూపకపోవటంతో ప్రయత్నం విఫలమైందన్నారు. దుర్గిలో మోడల్ స్కూల్‌కు స్థలం కేటాయింపు విషయంలో కలెక్టర్‌ను సంప్రదించి చేసిన కృషి ఫలించిందని తెలిపారు. రెంటచింతలలో జెడ్‌పి పాఠశాల కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్ ఒడ్డునే ఉన్న మాచర్ల నియోజకవర్గంలో సాగు, తాగునీరు లేని దుస్థితి నెలకొందన్నారు. వరికిపూడిసెల ప్రాజెక్టు ఈ ప్రాంత ప్రజల ఐదు దశాబ్దాల కల అని, అన్ని ప్రభుత్వాలు దానిపై వాగ్దానాలతో సరిపెట్టాయని విమర్శించారు. వరికిపూడిసెల ఆవశ్యకత గూర్చి పలుమార్లు అనేక వేదికపై, శాసనమండలిలో ప్రశ్నించానని తెలిపారు. పిడిఎఫ్ అభ్యర్థులుగా గెలిచిన వారు గెలిచిన రంగంపైనే కాకుండా సమాజంలో ప్రజలెదుర్కొంటున్న అన్ని సమస్యల పరిష్కారంపై పోరాటంలో ముందుంటున్నారని చెప్పారు. పిడిఎఫ్ బలం ప్రజాసంఘాలతో పాటు కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలేనన్నారు. మార్చిలో జరగనున్న శాసనమండలి ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కెఎస్ లక్ష్మణరావు నిరుద్యోగ సమస్యలను, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. ఆయా సమస్యలపై జరుగుతున్న ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని మద్దతుగా నిలిచారన్నారు. ఆయన గెలుపు ప్రజా సంఘాల బాధ్యతన్నారు. మాచర్ల సమావేశంలో యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, జనవిజ్ఞాన వేదిక నాయకులు జెవికెఎస్. ప్రసాద్, కేళం ఆదినారాయణ, యుటిఎఫ్ నాయకులు ఆయోషా సుల్తానా, నాగరాజు, నాసర్, గాలిబ్, కిరిటిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సిఐటియు నాయకులు బి.మహేష్, వెంకట్రావు, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, ఆశా, అంగన్వాడీ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు. సత్తెనపల్లి సమావేశంలో కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహన్‌రావు, ప్రేమ్‌కుమార్, కిషోర్ కుమార్, ఎ.వెంకటేశ్వరరావు, ఎస్కె షరీఫ్ పాషా, జి.చలమయ్య, పి.మహేష్, జి.బాలకృష్ణ, డి.విమల, జి.ఉమశ్రీ, జె.రాజ్‌కుమార్, ఎం.హరిపోతురాజు, జి.లక్ష్మీనారాయణ, జి.రజని, పి.ఇర్మియ, పి.పాములయ్య, జి.రవిబాబు, కె.సుజాత, కెబిఆర్జె ప్రసాద్ పాల్గొన్నారు.

సచివాలయాల పునర్ వ్యవస్థీకరణ

(మొదటి పేజీ తరువాయి)

ఖాళీలను భర్తీ చేయకుండా ఉన్న వాటిల్లోనే మార్పులు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా రేషనలైజేషన్ ద్వారా మల్టీపర్పస్ ఫంక్షనరీస్, టెక్నికల్ ఫంక్షనరీస్‌గా వీరిని విభజించాలనేది ప్రతిపాదన చేశారని తెలిసింది. మల్టీపర్పస్ ఫంక్షనరీస్ విభాగంలోకి విలేజ్ సెక్రటేరియట్ పరిధిలోని పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, గ్రామ మహిళా పోలీస్ వస్తారు. వార్డు సెక్రటేరియట్‌లో వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సెక్రటరీ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి వస్తారు. టెక్నికల్ ఫంక్షనరీస్ విభాగంలోకి గ్రామ సచివాలయం పరిధిలో విఆర్ఒ ఎఎన్ఎం, సర్వే అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్ సెక్రటరీ, వెటర్నరీ సెక్రటరీ, ఎనర్జీ అసిస్టెంట్ ఉంటారు. టెక్నికల్ ఫంక్షనరీస్ విభాగంలో వార్డు రెవెన్యూ సెక్రటరీ, వార్డు హెల్త్ సెక్రటరీ, వార్డు ప్లానింగ్ సెక్రటరీ, వార్డు ఎమినిటీస్ సెక్రటరీ, వార్డ్ శానిటేషన్ సెక్రటరీ, వార్డు ఎనర్జీ సెక్రటరీ వస్తారు. జనాభా ప్రాతిపదికనా మార్పులు చేయాలని తలపెట్టారు. సచివాయాల పునర్ వ్యవస్థీకరణ వల్ల క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఎలాంటి సమస్యలు, సదుపాయాలు వస్తాయన్నదీ ఆసక్తికర చర్చ జరుగుతోంది.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-చిలకలూరిపేట, మేడికొండూరు



ఆదివారం తెల్లవారుజామున వాటిల్లిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. ఒక ప్రమాదం పల్నాడు జిల్లా నరసరావుపేట మండలంలో, మరో ప్రమాదం గుంటూరు జిల్లా పేరేచర్ల వద్ద జరిగాయి. వీటిపై వివరాల ప్రకారం.. చిలకలూరిపేట పట్టణం మదర్ థెరిస్సా కాలనీకి చెందిన గాదె అంజిరెడ్డి (47) సూర్య దినపత్రికలో పని చేస్తుంటారు. ఇటీవల వారి ఇంటికి బంధువులు రాగా వారిని పిడుగురాళ్లలో దిగబెట్టేందుకు ఆదివారం తెల్లవారుజామున కారులో వెళ్లారు. బంధువులను వారి ఇళ్లకు చేర్చి తిరిగి వస్తుండగా 7 గంటలప్పుడు నరసరావుపేట మండలం పమిడిపాడు వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. అనంతరం కారు పోలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అంజిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలిని నరసరావుపేట రూరల్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



మేడికొండూరు మండలం పేరేచర్ల వద్ద ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో యువకుడు మృతి చెందాడు. ఏలూరు జిల్లా కలిదిండికి చెందిన మేకభాగ్య రమేష్ గుంటూరు వైపు నుండి ద్విచక్ర వాహనంపైన పేరేచర్ల వైపు వస్తున్నాడు. గుంటూరు రోడ్‌లోని చంద్రయ్య పెట్రోల్ బంకు వద్ద మరో వాహనం ఢీకొట్టడంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలిని పరిశీలించారు. మృతుని జేబులోని కార్డుల ఆధారంగా వివరాలు తెలుసుకుని బంధువులకు అప్పగించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటాడని తెలిసింది.

ఇదిలా ఉండగా చిలకలూరిపేట వద్ద కారు ప్రమాదం జరిగింది. అయితే అందులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బాపట్ల జిల్లా పర్చూరుకు చెందిన ఐదుగురు సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ నుండి పర్చూకు కారులో వస్తున్నారు. తెల్లవారుజామున కారు పసుమర్రు బ్రిడ్జి వద్దకు రాగానే అదుపు తప్పి రోడ్డు పక్కనున్న స్యూటీని ఢీకొట్టింది. అనంతరం వాగులోకి దూసుకెళ్లింది. ఆ ప్రదేశంలో డంపింగ్ యార్డు చెత్త ఉండడంతో కారు వేగం తగ్గి నిలిచిపోవడంతో పెద్ద ముప్పే తప్పింది. రోడ్డు మలుపు ఉండడం, అయినా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్ల ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. బ్రిడ్జికి సంబంధించి రక్షణ చర్యలూ చేపట్టాలంటున్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల సంస్కరణలు అవసరం

జైభారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు జెడీ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- మాచర్ల



ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల సంస్కరణలు తేవాలని జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు జెడీ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం బాపట్లలో జరిగే ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యేందుకు హైదరాబాద్ నుండి వెళ్తున్న ఆయన మాచర్లలో రోటరీక్లబ్ సభ్యులు మేడం నాగేశ్వరరావు నివాసంలో అల్పాహారానికి ఆగారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల్లో కులం, మతం, ప్రాంతం, డబ్బు, అంగబలాలు తీవ్ర ప్రభావాలు చూపుతున్నాయన్నారు. పార్టీ ఫిరాయింపులు, నేరచరిత్రలు ఉన్నవారు ప్రజాప్రతినిధులుగా చలామణి అవ్వటం, ఆచరణ సాధ్యం కాని ఉచితాలను ఎన్నికల వాగ్దానాలుగా ప్రకటించడం ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టం చేకూరుస్తున్నాయని చెప్పారు. ప్రతిపక్షం లేకుండా ఏకపక్ష గెలుపు కూడా ప్రజా స్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రతిపక్షం బలంగా ఉండి రాజకీయ నిర్ణయాలపై అర్థవర్ధమైన చర్చ జరిగితేనే ప్రజలకు మేలన్నారు. ఒక పార్టీ తరుపున గెలిచి, మరో పార్టీలోకి ఫిరాయించిన వారిని స్పీకర్ వెంటనే అనర్హులుగా ప్రకటించాలన్నారు. ఒక్కసారి ఎన్నికైతే ఐదేళ్ల వరకు నన్నేమి చేయలేరనే ధోరణి ప్రజాప్రతినిధుల్లో నెలకొందని, అందుకే రీకాల్ పద్ధతి తేవాలని, చేసిన వాగ్దానాలు నెరవేర్చకపోతే తొలగించే అధికారం ప్రజల చేతుల్లో ఉండాలని అభిప్రాయ పడ్డారు. దామాషా పద్ధతిని ఎన్నికల్లో ప్రవేశపెట్టాలని, పార్టీలకు వచ్చిన ఓట్ల ఆధారంగా ప్రజా ప్రతినిధుల సంఖ్యను నిర్ణయించే పద్ధతి ఉంటే ఆ పార్టీలకు చట్టసభల్లో మాట్లాడే అకాశం వస్తుందని చెప్పారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ విధానం 22 దేశాల్లో అమల్లో వుందని చెప్పారు. ఇవిఎంలపై అనేక ఆరోపణలు వస్తున్నాయని, కొన్ని ఓట్ల అనంతరం మిగిలిన ఓట్లన్ని ఏ బటన్ నొక్కినా ఒకే పార్టీకి వెళుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయని, ఈవిఎంల బ్యాటరీల చార్జింగ్ కూడా ఎన్నికల రోజు కంటే కౌంటింగ్ రోజు ఎక్కువుగా ఎందుకు ఉంటుందని, పోలైన ఓట్లకు,లెక్కించిన ఓట్లకు మధ్య వ్యత్యాసంపై కూడా అనేక అనుమానులున్నాయని చెప్పారు. వీటిపై ప్రభుత్వం వివరంగా ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. వలన కార్మికులు, విదేశాల్లో ఉన్నవారు కూడా తేలికగా ఓటు హక్కు వినియోగంచుకునేందుకు ఎన్నికల సంస్కరణ అవసరమని, ఎక్కువ శాతం ఓటింగ్ జరిగితేనే మేలైన ప్రజాభిప్రాయం వ్యక్తం అవుతుందని తెలిపారు. మాచర్ల నియోజకవర్గం గురించి మాట్లాడుతూ చాలా వివాదస్పదంగా వార్తలు వినిపించేవని, ఈ నియోజకవర్గం పేరు మీద సినిమానే తీశారని గుర్తుచేశారు. వివేకానందుని స్ఫూర్తితో యువత చైతన్యవంతమై ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు పంపిణీ


ప్రజాశక్తి - పెదకాకాని : యువత ఉన్నత విద్య, ఉద్యోగాలతో పాటు సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, గ్రీన్ సోల్ పవర్ సిస్టమ్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జెట్టి శివరాం ప్రసాద్ అన్నారు. మండలంలోని వెనిగండ్ల గ్రామం శివారు కౌండిన్యపురంలోని కౌండిన్య ఐఎఎస్ అకాడమీ భవనంలో కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 19వ ఉపకార వేతన ప్రదానోత్సవం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శివరాం ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిభ కలిగి ఆర్థికంగా వెనుకబడిన పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఆర్థిక చేయూతనివ్వడంతో పాటు కెరీర్ గైడెన్స్, పోటీ పరీక్షలకు శిక్షణ ద్వారా సామాజిక పురోభివృద్ధికి కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, ఐఎఎస్ అకాడమీలు కృషి అభినందనీయమన్నారు. అనంతరం విశ్రాంత ఐఎఎస్ అధికారి పడమటి సుందర్ కుమార్, విశ్రాంత ఐపిఎస్ అధికారి జక్కంశెట్టి సత్యనారాయణ, కమర్షియల్ టాక్సెస్ విశ్రాంత అధికారి వై.సత్యనారాయణ మాట్లాడారు. సభకు డాక్టర్ ఈవీ నారాయణ అధ్యక్షత వహించగా వి.సుబ్బారావు, డాక్టర్ టి.సాంబశివరావు, కె.లక్ష్మీనారాయణ, పి.సాంబశివరావు, బి.వెంకటేశ్వరరావు, చంద్రమౌళి, డాక్టర్ టి.సేవకుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణి

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో ఆదివారం మారా భ్రమరాంబ 8వ వర్థంతి సందర్భంగా తెనాలి పెరుగు మార్కెట్ ఆవరణలో మున్సిపల్ పారిశుధ్య కార్మికలకు చీరలు పంపిణి చేశారు. క్లబ్ అధ్యక్షులు లయన్ నేరెళ్ల కృష్ణమోహన్‌రావు, క్లబ్ వ్యవస్థాపకులు లయన్ కాకరపర్తి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతకు కృషి చేసే, పర్యావరణ హితమైన విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ మంచి విషయమన్నారు. క్లబ్ సెక్రెటరి లయన్ ఎస్.రామ్‌ప్రసాద్, లయన్ కె.చిన్నకృష్ణారెడ్డి, బి.సంధ్యారాణి, ఎం.రోజారమణి, పి.మాధవి. ఎం.శివలక్ష్మి, జి.రమణ, పి.రాణి పాల్గొన్నారు.

అన్నపర్రు అభివృద్ధిలో కొల్లా రత్తయ్య దంపతుల కృషి

ప్రజాశక్తి - పెదనందిపాడు



మండలంలోని అన్నపర్రు గ్రామాభివృద్ధికి మాజీ జెడ్‌పిటిసి కొల్లా రత్తయ్య, ఆయన భార్య, మాజీ సర్పంచ్ అయిన ఉమామహేశ్వరి సేవలు మరువలేనివని అన్నపర్రు గ్రామస్తులు తెలిపారు. మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టి, 1983లో ఎన్టీ రామారావు పిలుపుతో టిడిపిలో చేరిన కొల్లా రత్తయ్య ఇప్పటివరకు ప్రజల సమస్యలు పరిష్కారానికి కృషి చేశారు. 2004-14 మధ్య 79 సాగునీటి సంఘం అధ్యక్షులుగా రత్తయ్య పని చేశారు. కొప్పర్రు శ్రీనివాస ఎత్తిపోతల పథకం అభివృద్ధికి కృషి చేశారు. 2013లో ఉమామహేశ్వరి సర్పంచ్‌గా గెలుపొందారు. 2014లో కొల్లా రత్తయ్య ఎంపిటిసిగా గెలిచారు. 2014-19 మధ్య గ్రామంలో సిమెంటు రోడ్లు వేయించారు. వారి సోదరుడు కొల్లా కోటేశ్వరరావు పేరు మీద సొంత డబ్బులతో 30 మంది పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి, వారికి ఇళ్ల నిర్మాణంలోనూ చేయూతనిచ్చారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు, రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యాల అభివృద్ధి చేయించారు. కొప్పరు, అన్నపర్రు, వరగాని గ్రామాలను కలుపుతూ జెడ్‌పి నిధులతో తారు రోడ్డు వేయించడంలో కీలక భూమిక పోషించారు. తమ పదవి కాలంలో అన్నపర్రును మండలంలోనే అభివృద్ధిలో ముందు భాగాన నిలిపారు. ఎస్సీ కాలనీలో మరుగుదొడ్ల నిర్మాణానికి సొంత నిధులు వెచ్చించారు. జెడ్‌పి పాఠశాలకు కంప్యూటర్ అందించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు నిధులు సమకూర్చారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు డిజిటల్ సౌకర్యం కల్పించారు. నూశాలమ్మ గుడి పునర్నిర్మాణానికి రూ.4.30 లక్షలు అందించారు. దేవాలయాల్లో అన్నదానాలకు రత్తయ్య దంపతులు బహుముఖంగా సహకరిస్తున్నారు. వారి సేవా కార్యక్రమాలకు కుమారుడు కొల్లా వెంకట శ్రీనివాసరావు సహాయ సహకారాలు అందిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా సాగుతున్న ఈ సేవలు మరింతగా కొనసాగాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. వారికి సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతున్నారు.

ప్రజాశక్తి

3

సోమవారం 13 జనవరి 2025

జిఎంసి ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక ఎన్‌టిఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై రంగవల్లుల పోటీలు, మెహంది కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల థీమ్‌లతో ముగ్గులు వేసి రంగులు అద్దారు. రంగవల్లుల పోటీల్లో 72 మంది పాల్గొన్నారని, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ బహుమతులు అందిస్తామని నగర కమిషనర్ తెలిపారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ జిఎంసి ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్రాంతి సంబరాలు గుంటూరు నగరానికి సాంప్రదాయకమైన సొబగులు తెచ్చాయన్నారు. రంగవల్లుల పోటీల్లో మహిళలు చాలా ఉత్సహంగా పాల్గొన్నారని, ఇదే ఉత్సాహంతో మరో 3 రోజులపాటు జరిగే సంబరాల్లో పాల్గొనాలని కోరారు. అనంతరం రంగవల్లుల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన జి.సురేఖ, పి.సుజాత, టి.భారతికి బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న 6వ తరగతి విద్యార్థిని సుప్రతికి ప్రత్యేక బహుమతి, మరో 5 మందికి కన్సొలేషన్ బహుమతులను కమిషనర్, ఎమ్మెల్యే చేతులమీదుగా అందచేశారు.కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సిటిప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, నిర్వహణ కమిటి సభ్యులు డి.శ్రీనివాసరావు, విజయలక్ష్మి, కాశయ్య, నసీర్ అహ్మద్, లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్

ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో ముగిసిన సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - మేడికొండూరు



మేడికొండూరు సమీపంలోని విశదల అడ్డ రోడ్డు వద్ద గల ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో గత మూడు రోజులు క్రితం ప్రారంభమైన సంక్రాంతి పండుగ సంబ రాలు ఆదివారంతో ముగిశాయి. కార్యక్ర మాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఈ సంబరాలకు ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామికవేత్త సాఫ్ట్వేర్ కంపెనీ అధినేత శ్రీ శరత్ విచ్చేసి ఈ కార్యక్రమాలను భోగిమంటలతో ముగించారని తెలిపారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ సాంప్రదాయ బద్దమైన ఇటువంటి సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం మన సాంప్రదాయానికి, మన భావితరాలకి మనమే నేర్పించాలని తెలియజేశారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి తిలక్ బాబు మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రతి సంవత్సరం ఈ విధంగా సంక్రాంతి సంబ రాలు జరుపుకోవడం ఆనవాయితీ అని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకుల పిల్లలకు భోగి పండ్లతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరిరావు, ఏవో బండారు సీతా రామయ్య తదితరులు పాల్గొన్నారు.





పల్నాడు జిల్లా స్పందన కార్యక్రమం రద్దు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : సంక్రాంతి సందర్భంగా సోమవారం బోగి పండుగ నేపథ్యంలో స్పందన కార్యక్రమం రద్దు చేశారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్.పి కె.శ్రీనివాసరావు వేర్వేరు ప్రకటనలలో పేర్కొన్నారు. ఆయా సమస్యలు పరిష్కారం కోసం వచ్చే ప్రజలు సహకరించాలని కోరారు.



చెక్కులను అందజేస్తున్న టిడిపి నాయకులు

మంత్రి లోకేష్ చొరవతోఎల్‌ఒసి మంజూరు

ప్రజాశక్తి-మంగళగిరి : మంగళగిరి పట్టణంలో అనారోగ్యంతో ఎన్నారైలో చికిత్స పొందుతున్న దామర్ల దుర్గమహేశ్వరరావుకు మంత్రి నారా లోకేష్ సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.4 లక్షల 50 వేల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) ఇప్పించారు. మంత్రి నారా లోకేష్‌కు అర్జీ పెట్టుకోగా వెంటనే స్పందించిన ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఆ ఎల్‌వోసీ పత్రాన్ని టీడీపీ నాయకులు ఆదివారం బాధితుడి ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, 30వ వార్డు అధ్యక్షులు భైరబోయిన శివశంకర్, నాయకులు వాకా మాధవరావు, భైరబోయిన శ్రీనివాస్, వల్లభనేని భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తెనాలి : రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు కథనం మేరకు సుమారు 60 ఏళ్ల వయసున్న వ్యక్తి సింహగఢ్ నుండి తాంబరం వెళ్లే రైలు నుండి పెదవడ్లపూడి రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం జారిపడిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తెల్ల చొక్కా ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీ లించి మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు.



భోగిమంటలను వెలిగిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

అమరావతి నిర్మాణంతో ఉద్యోగాలు

మంత్రి నాదెండ్ల వ్యవసాయ క్షేత్రంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు, రైతాంగానికి మేలు చేసేవిధంగా ప్రణాళిక రూపకల్పన చేయాల్సిన ఆవశ్యకత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పెదరావూరు మంత్రి వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటుచేసిన సంక్రాంతి సంబరాల్లో ఆదివారం భోగి పండుగ సంబరాలను నిర్వహించారు. ప్రతి కుటుంబంలో చిరునవ్వులు సంతరించుకునేల సంక్రాంతి వేడుకలు నిర్వహించుకోవాలని రాష్ట్ర ప్రజలకు సందేశమిచ్చారు. అమరావతి రాజధాని నిర్మాణం ద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని తద్వారా స్వంత గ్రామాల్లోనే పండుగలు నిర్వహించుకోవచ్చని అన్నారు. గత ప్రభుత్వంలో రైతాంగానికి ఇవ్వాల్సిన రూ.1674 కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లో చెల్లించిందని తెలిపారు. ఖరీఫ్ లో సేకరించిన ధాన్యానికి మద్దతు ధరను 8 నుంచి 24 గంటల్లోపు చెల్లించి రైతు పక్షపాతి అనిపించుకుందని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ఆయుర్వేద వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-గుంటూరు

ఆరోగ్య నియమాలతో పాటు వివిధ వ్యాధుల చికిత్సలలో సమగ్ర సమాచారాన్ని అందించే ఆయుర్వేద వైద్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమనిప్రముఖ ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ పిఎస్ఆర్ శివకళ్యాణ్ అన్నారు.ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆయుర్వేద వైద్యవిదానంపై వివి రావ్ అధ్యక్షతన జరిగిన ఆరోగ్య సభలో ఆయుర్వేద మెడికల్ కాలేజి విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ శివకళ్యాణ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాడ్లాడుతూ వందల, వేల సంవత్సరాల నుండి ఆయుర్వేదం మన జీవన విధానంలో భాగంగా ఉందని, ఎన్నో రకాల వ్యాధుల నివారణకు, చికిత్సకు ప్రజలకు ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ రోజుల్లో తరచుగా వచ్చే జ్వరం, దగ్గు, జలుబు వంటి ఇన్ఫెక్షన్లకు ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్ లేకుండా ఆయుర్వేదంతో నయం చేయటానికి ఆస్కారం ఉందన్నారు. అలాగే జీర్ణకోశ వ్యాధులు, ఎలర్జీలు, చర్మ వ్యాధులు లాంటి వాటికి కూడా మనం వంటింట్లో వాడే జీలకర్ర, మిరియాలు, శొంఠి మొదలైన వాటితో పూర్తిగా నివారించవచ్చన్నారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధుల్లో పసుపు, పిప్పళ్ళు వంటివి యాంటీ బయటిక్స్‌గా పని చేస్తాయని, నడుంనొప్పి, మెడనొప్పి, ఆర్థరైటిస్ వంటి వాటికి, తీవ్ర నొప్పిని నివారించేందుకు సల్లకి, గగ్గులు, శొంఠి వంటి ఆయుర్వేద ఔషధాలు చక్కని ఫలితాలు ఇస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శివ కళ్యాణ్‌ను సంస్థ సభ్యులు సత్కరించారు. సభలో ప్రొఫెసర్ రత్నారావు, ఉపాధ్యాయులు రత్నారెడ్డి, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ప్రసంగించారు.



ఆరోగ్య సభలో మాట్లాడుతున్న డాక్టర్ శివకళ్యాణ్

అవగాహన ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి..

స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ సభ్యులు సి.హెచ్.పి. ఆంజనేయులు అధ్యక్షత వహించగా, విద్యావేత్త ఇ.చంద్రయ్య, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం ఎస్.వి.సత్యనారాయణ, వై.వి.రెడ్డి, సి.శేషగిరిరావు తదితరులు పాల్గొని వివేకానంద చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు.

టిజెపిఎస్‌లో స్వామి వివేకానంద జయంతి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కళాశాలలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని కళాశాల విద్యార్థులకు ప్రేరణాత్మక ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన శ్రీధర్ మాట్లాడుతూ మానవుని జీవితం కష్టసుఖాల మిశ్రమం అని కష్టం వచ్చినప్పుడు కుంగిపోకుండా సంతోషం వచ్చినప్పుడు పొంగిపోకుండా ఉండాలన్నారు. కష్ట సమయాలలో వివేకానందుని శక్తివంతమైన మాటలు మనకు ఆత్మ విశ్వాసాన్ని కలిగించి విజయమార్గం వైపు దారి చూపిస్తాయన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండంట్ కె.వి.బ్రహ్మం మాట్లాడుతూ 'మేల్కొండి, లేవండి, గమ్యం చేరేవరకు విశ్రమించకండి, ఇనుప కండరాలు, ఉక్కు నరాలు ఉన్నటువంటి యువత ఈ దేశానికి చాలా అవసరం వంటి శక్తి ప్రేరణాత్మకమైన మాటలు మనలో నూతన ఉత్తేజాన్ని కలిగిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు పోలిశెట్టి శ్యాంసుందర్, కమిటీ సభ్యులు నాగసుందరం, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, స్టెప్ మేనేజర్ రాధిక, డిగ్రీ కాలేజి ఇన్‌చార్జి భానుమురళి, ఇంటర్ ఇంచార్జ్ జి.సురేష్‌కుమార్, ఎన్ఎస్ఎస్ జిల్లా అధికారి డాక్టర్ జెవి సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు



ప్రజాశక్తి - చేబ్రోలు వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవం నారాకోడూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగానిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు ఎం ఏడుకొండలు ఎన్ సీ సీ క్యాడేట్స్ పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి దుర్గా బాయి సి హెచ్ నాగేశ్వరరావు , ఎన్ ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఐదుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - బెల్లంకొండ : కోడి పందేలు ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. చంద్రాజుపాలెం గ్రామంలో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బం దితో వెళ్లి దాడుల నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇదే క్రమంలో అదే గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 1800 రూపాయలతో పాటుగా, కోళ్ళ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

ప్రజాశక్తి - కొల్లిపర : కొల్లిపర మండలం గుదిబండివారిపాలెంలో అరటి తోటలో ఆదివారం పేకాడుతున్న 9మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. వారి వద్ద నుండి రూ.80,700 క్యాష్, 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.

రాకపోకలకు అధికారులు చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఫిరంగిపురం : పొనుగుపాడు గ్రామంలో చర్చికి, ముస్లింల స్మశాన స్థలానికి మధ్యనున్న బజారుని కొంత మంది వారి స్వార్థంతో వివాదస్పదం చేశారని, సమస్యను అధికారులు పరిష్కరించాలని సిపిఎం నాయకులు ఎస్‌కె మస్తాన్‌వలి, గుంటుపల్లి వెంకటే శ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సమస్య చుట్టూ రాజకీయ విబేదాలను, సామాజిక తరగతుల తేడాలను సృష్టించారన్నారు. ఆ స్థలం పంచాయతీ బజారని ఒకరు, చర్చి స్థలం అని ఒకరు వివాదం చేసి రోడ్డు మీద నడవడానికి వీలు లేకుండ గత ప్రభుత్వం అండతో గోడను నిర్మించారన్నారు. ఇరువర్గాలు కోర్టులో కేసు వేశారని, ప్రభుత్వం మారిన వెంటనే గోడను తొలగించాలని ఒక వర్గం ప్రయత్నం చేసి, శనివారం రెవెన్యూ అధికారులు, పోలీస్ బందోబస్తుతో గోడను కూల్చివేశారని తెలిపారు. దీంతో ఏడు సంవత్సరాల వివాదానికి తెర పడిందని, ఇప్పటికైనా రికార్డు ప్రకారం సర్వే నిర్వహించి, చర్చికి కేటాయించిన భూమి హద్దులను నిర్ణయించి, బజారు రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకుని గ్రామంలో శాంతి భద్రతలను కాపాడాలని వారు ప్రకటనలో కోరారు.



ఘనంగా మాజీ సర్పంచ్ షష్టిపూర్తి వేడుకలు

ప్రజాశక్తి - దాచేపల్లి

పట్టణంలోని ముత్యాలంపాడు రోడ్‌లో దాచేపల్లి మాజీ సర్పంచ్ అంబటి రామారావు, లక్ష్మీకోటమ్మ దంపతుల షష్టిపూర్తి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రామారావు గతంలో దాచేపల్లి ఉపసర్పంచ్‌గా, సర్పంచ్‌గా రెండు పర్యాయాలు పనిచేసి స్థానికుల మన్ననలు పొందారు. ఈయన పదవీ కాలంలోనే ఎస్సీ, ఎస్టీలు, వడియ రాజుల ప్రాంతాల్లోని నాలుగు వీధుల్లో 1991 అక్టోబర్ 16న విద్యుత్ వెలిగించిన సర్పంచిగా పేరుగాయించారు. ఆనాటి నుండి నేటి వరకు దాచేపల్లి సర్పంచిగా మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తిగా పేరు సంపాదించుకున్నారని పలువురు అభినందించారు. కార్యక్రమంలో దాచేపల్లి నగర పంచాయతీ చైర్మన్ సుబ్బమ్మ సాంబయ్య, మాజీ ఎంపిపి అంబటి శేషగిరిరావు, మాజీ సర్పంచులు అనగా నిమ్మయ్య, తంగెళ్ల శ్రీనివాసరావు, వైద్యులు కర్ణాటక వరలక్ష్మి పాపయ్య దంపతులు, పార్థు హాస్పిటల్ అధినేత సాయికర్ణ, విశ్రాంతి ఉద్యోగి దాచేపల్లి ఈవో మందపాటి రామిరెడ్డి, బంధువులు స్నేహితులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ స్కాలర్‌షిప్ టెస్టుకు విశేష స్పందన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



మాట్లాడుతున్న డాక్టర్ ప్రకాశరావు

చిన్నతనం నుండే విద్యార్థులు క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావాన్ని అలవర్చుకోవాలని సెల్ ఫోనులకు దూరంగా వుండాలని ప్రముఖ మోటివేషన్ స్పీకర్ వేణుగోపాల్ సూచించారు. నరసరావుపేట మండలం కేశానుపల్లిలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం అన్ని తరగతుల విద్యార్థులకు స్కూల్‌లో స్కాలర్షిప్ టెస్టుతో పాటు అవగాహన సదస్సును నిర్వహించారు. పరీక్షకు 978 మంది విద్యార్థులు హాజరయ్యారని స్కూల్ చైర్మన్, నరసరావుపేట మథర్ థెరిస్సా హాస్పిటల్ అధినేత డాక్టర్ నాగోతు ప్రకాశరావు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మోటివేషనల్ స్పీకర్ వేణుగోపాల్ తల్లిదండ్రులను, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నెలకొల్పిన ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పల్నాడు జిల్లాకే తలమాన్కిం అవుతుందని తెలిపారు. విద్యార్థులను చదువుతో పాటు క్రీడలు, సంగీతం, యోగా వంటి వాటిలో శిక్షణ ఇవ్వడం వలన శారీర, మానసిక ఉల్లాసం పొందుతారని చెప్పారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ జనరల్ మేనేజర్ సిహెచ్.రామరాజు గౌరవ అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్కాలర్షిప్ పరీక్షా ఫలితాలను, పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను 20వ తేదీలోపు విద్యార్థులకు అందజేస్తామని ఏవో రఘుపతి తెలిపారు.

సంస్కృతీ సంప్రదాయాలపై మక్కువ పెంచండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : సంక్రాంతిని ప్రతి ఒక్కరూ సంతోషంగా చేసుకోవాలని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ శుభాకాంక్షలు తెలిపారు. నేటి తరం పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాల పట్ల మక్కువ తగ్గిపోతుందని, ఈ నేపథ్యంలో వాటిని బావి తరాలకు తెలిసేలా వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.

బలవంతపు సభ్యత్వాలతో టిడిపి మరో తరహా వేధింపులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సంఘంలో సభ్యులు స్వచ్ఛందంగా చేరాలని సంఘ చరిత్ర, చేసే పోరాటాల పట్ల ఆకర్షితులై సంఘంలో చేరాలే కానీ దీనికి విరుద్ధంగా తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కమిటీ (టిఎన్‌టియుసి) వ్యవహరించడం సరికాదని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ అన్నారు. నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అంగన్వాడీలు టిఎన్‌టియుసిలో తప్పకుండా చేరాల్సిందేనని నేరుగా టిడిపి నాయకులే అంగన్వాడీలకు ఫోన్ చేసి బెదిరించడం, భయభ్రాంతులకు గురి చేయటం ఏమిటని విమర్శించారు. ఐక్య పోరాటాలు చేస్తున్న సిఐటియు యూనియన్‌ను విచ్ఛిన్నం చేసేందుకే టిఎన్‌టియుసి సభ్యత్వ నమోదు పేరుతో కొత్త తరహా వేధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సంఘం ఏర్పాటు వెనుక ఎంతో కృషి, ఎందరో త్యాగం ఉంటుందని, సంఘ కార్యకలాపాలకు సంబంధించి ఉన్నత వ్యక్తులు నిర్ణయాలు చేసి సంఘానికి రూప కల్పన చేస్తారని అధికార పార్టీ అండదండలతో ఏర్పాటైన సంఘం మనుగడ తాత్కాలికమేనని అన్నారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు కెపి మెటిల్డాదేవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ వేధింపులు ద్వారా టిడిపికి చెందిన మహిళలకు అంగన్వాడీ ఉద్యోగాలు కట్టబెట్టేందుకు చేసిన ప్రయత్నాలను సిఐటియు తిప్పికొట్టి అంగన్వాడీలకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. ఇది ఓర్వలేని అధికార పార్టీ నాయకులు కుట్రలు చేస్తున్నారని, అందులో భాగంగా బలవంతపు సభ్యత్వ నమోదుకు తెరలేపారని అన్నారు. వైసిపి పాలనలో అంగన్వాడీలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని, హక్కులు, డిమాండ్ల సాధనకు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు అనేక పోరాటాలు చేశారని, అప్పుడు వైసిపికి వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో చేసే పోరాటాలకు కనీసం మద్దతు కూడా తెలపని టిఎన్‌టియుసి ప్రస్తుతం అధికారాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయడం సరికాదని అన్నారు. సంఘం ఏర్పాటు నిర్వహణ సంఖ్యా బలం ద్వారా రాదని, చేసిన ఉద్యమాలు, సాధించిన విజయాలపై ఆధారపడి ఉంటుందనే విషయం గ్రహించాలని హితవు పలికారు.

అంగన్వాడీలను బెదిరించి టిఎన్‌టియుసి సభ్యత్వ నమోదు : సిఐటియు



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

పంటలన్నీ మద్దతు ధరకు కొనాలి : రైతుసంఘం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

చివరి ధాన్యపు గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుసంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కన్నెగంటి హనుమంతు ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లడుతూ గత రెండు మూడేళ్లుగా సాగునీరు లేకపోవడంతో మాగాణి భూములు మొత్తం పడావు పడగా ఈ ఏడాది సకాలంలో వర్షాలు, సాగునీరు అందడంతో పల్నాడు జిల్లాలో 55 వేలకు పైగా ఎకరాల్లో వరి వేశారని చెప్పారు. సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి వచ్చినట్లు వ్యవసాయశాఖ అంచనా వేసిందని, ఇందులో ప్రభుత్వం 5 వేల మెట్రిక్ టన్నులనే ప్రభుత్వం కొనుగోలు చేస్తే మిగతా ధాన్యం ఏం కావాలని ప్రశ్నించారు. ప్రభుత్వ తీరుతో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోందని, దీనివల్ల ధర రూ.1300-1400 మాత్రమే ఇస్తూ రైతులను దళారులు దగా చేస్తున్నారని విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం అది ఇవ్వకపోగా కనీసం పంటనైనా కొనడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. గతంలో 22 శాతం తేమకు పరిమితి ఉంటే ఇప్పుడు 17 శాతం వరకే పరిమితులు పెట్టడం వల్ల రైతులు మరింత నష్టపోయే అవకాశం ఉందన్నారు. రైతులుకు మద్దతు ధర రూ.1,740 ఇచ్చి ధాన్యం మొత్తాన్ని కొనాలన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో శీతల గిడ్డంగుల్లో 35 లక్షల బస్తాల మిర్చి నిల్వ ఉందని, ధర క్వింటాళ్ రూ.10-15వేలు ధర ఉండటం వల్ల రైతులకు కనీసం గిడ్డంగుల్లో దాచుకున్న పంటకు అద్దె ఖర్చులు కూడా రాక నష్టపోతున్నారని తెలిపారు. కొత్త పంట వస్తున్న తరుణంలో పాత పంట ఇలా నిల్వ ఉండటం వల్ల మిరప రైతులు ఎంతో నష్టపోతారని, ప్రభుత్వం చొరవచూపి పూర్తి స్థాయిలో గిడ్డంగుల్లో ఉన్న మిర్చిని మంచి ధరలకు కొనాలన్నారు. కందులు, శనగలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పిన ప్రభుత్వం పల్నాడు జిల్లాలో ఎక్కడా కేంద్రాలు ఏర్పాటు చేయలేదని, ఇప్పటికైనా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలకు పూనుకోక తప్పదని హెచ్చరించారు.

ఎ.ముప్పాళ్లలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-ఈపూరు

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆరేపల్లి ముప్పాళ్లలో 33వ రైతుమిత్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి కబడ్డీ ఓపెన్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడంతోపాటు క్రీడాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని గ్రామంలో 33 ఏళ్లుగా కబడ్డీ పోటీలు నిర్వహించడం వారి ఐక్యతకు నిదర్శనమన్నారు. గెలుపోటములు సహజమని, లక్ష్యం దిశగా క్రీడాకారులు ముందుకు సాగాలని సూచించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని కబడ్డీ పోటీలను ప్రారంభించారు. పోటీలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి 50 జట్లు పాల్గొంటున్నాయని రైతుమిత్ర కమిటీ నిర్వాహకులు తల్లపనేని రామారావు తెలిపారు. ఆరు రోజులపాటు డే అండ్ నైట్ జరిగే ఓపెన్ టోర్నమెంట్లో పాల్గొనే క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టిడిపి పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, రైతుమిత్ర కమిటీ సభ్యులు సూరే కోటేశ్వరరావు, తల్లపనేని కోటేశ్వరరావు, పులి శ్రీనివాసరెడ్డి, సూరే బ్రహ్మయ్య, విడపులపాటి హనుమయ్య పాల్గొన్నారు.



ప్రజాశక్తి- మాచర్ల రూరల్

పండుగలు మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని మాచర్ల మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో మెగా ముగ్గుల పోటీలు నిర్వహించగా విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చైర్మన్ మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే ముగ్గుల పండుగని, వాసవి క్లబ్ చెన్నకేశవ ప్రతిఏటా పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన మున్సిపల్ కౌన్సిలర్ గట్ల అరుణకుమారి, ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సూపరింటెండెంట్ బంగ లక్ష్మీ ప్రసన్న, ఊటుకూరి నీరజ మాట్లాడుతూ భవిష్యత్తు తరాల వారికి మన సంస్కృతిని అందించాలన్నారు. మొదటి బహుమతి వినుకొండ శైలజకు బాబు జ్యువెలర్స్ గోల్డ్ వర్క్స్ తాళ్లూరి రవిబాబు అందజేయగా, రెండో బహుమతిని బచ్చు ధనలక్ష్మికి శ్రీ డిజైనర్ బోటిక్ గోపవరపు రజిత అందజేశారు. మూడో బహుమతి లక్ష్మీ త్రివేణికి సంధ్య మ్యాచింగ్ లేడీస్ కార్నర్ వేమ మోహన్ అందజేశారు. కన్సోలేషన్ బహుమతులను సాయిరంగ జ్యువెలర్స్ రంగా రాంబాబు, బచ్చు హనుమంతరావు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు రవితేజ మల్టీస్పెషల్టి హాస్పిటల్ డాక్టర్ శ్రీకాంత్, సుస్మిత బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు భవనాసి రవితేజ, కార్యదర్శి బత్తుల వీరబ్రహ్మం, కోశాధికారి బచ్చు రాజ్ కుమార్, జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, ఫాస్ట్ సెక్రటరీ పందిరి నరసింహారావు, వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధుల వెంకట నాగేశ్వరావు, సభ్యులు చుండూరు సత్యనారాయణ, లక్ష్మీ చెన్నకేశవ దేవస్థాన ఎగ్జిక్యూటివ్ అధికారి సాంబయ్య, గట్ల కోటిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ



ప్రముఖ చిత్రకారులు బొడ్డుచర్ల ప్రసాద్ భోగి సంక్రాంతి, కనుమ సందర్భంగా సంప్రదాయ కలలు కనుమరుగవుతున్న నేటి తరం యువతకు గుర్తుకొచ్చే విధంగా హరిదాసు బొమ్మను గీశారు. గ్రామాలు, పట్టణాల్లో గీతాల ఆలాపనలతో, కులమతాలకు అతీతంగా ప్రతి ఇంటినీ దర్శించే వ్యక్తి హరిదాసు అని అన్నారు. వారి చిత్రాన్ని గీయడం సంతోషంగా ఉందని చెప్పారు. చిత్రాన్ని తిలకించిన పట్టణ ప్రముఖులు, కళాకారులు ప్రసాదును అభినందించారు.

పొట్టేళ్లకు పెరిగిన డిమాండ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సంక్రాంతి నేపథ్యంలో పొట్టేళ్లకు డిమాండ్ పెరిగింది. వారాంతపు సంతల్లో ధరలు ఎక్కువగా ఉండడంతో వ్యాపారులు నేరుగా పెంపకం దారుల వద్దకే వెళ్లి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. సంక్రాంతి ముందు వచ్చే వారపు సంత మరొకటి ఉన్నప్పటికీ ముందుగా పెంపకం దారుల వద్ద కొనుగోలు చేసుకుంటే ధరలు తక్కువగా ఉంటాయని భావిస్తున్నారు. 15 కిలోల బరువుండే పొట్టేళ్లు గతంలో రూ.8 వేల నుంచి రూ.9 వేల వరకు ఉండేవి. ప్రస్తుతం రూ.12 వేల వరకు పలుకుతోందని పెంపకం దారులు చెబుతున్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటలపోటీలు





ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం కాజా గ్రామంలో డివైఎఫ్ఐ, ఐద్వాల ఆధ్వర్యంలో సంక్రాంతి అటలపోటీలు ఉత్సాహ పూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. సింహాద్రి బసవపున్నయ్య, అవుతు నాని, బుల్లా సందీప్ స్మారక సంక్రాంతి పోటీలు ఆర్ధల సూర్యనారాయణ, అప్పికట్ల శ్రీనివాసరావు మాస్టర్ క్రీడా ప్రాంగణంలో పోటీలు జరుగుతున్నాయి. ఈనెల 11 నుండి 14 వరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీలు తెలిపాయి. డాన్స్ బేబీ డాన్స్, సాంగ్స్, క్రికెట్, వాలీబాల్, చెస్, షటిల్, పోటీలతోపాటు డ్రాయింగ్, షాట్ పుట్, త్రో బాల్, స్లో బైక్, స్లో స్కూటీ, మ్యూజికల్ చైర్స్, కుండ కొట్టుట, క్విజ్, ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా మొదటి రోజు పోటీలను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ జె మధుబాబు, డాక్టర్ ఈదా రంగారెడ్డి లు పోటీలను ప్రారంభించారు. పోటీల ఆర్గనైజింగ్ కమిటీ పోటీల పర్యవేక్షణ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ప్రజాశక్తి-తెనాలిరూరల్

మానవ శ్రమ నుంచే కళలు ఉద్భవించాయని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటి సభ్యురాలు వల్లూరి భారతి, పిఎన్ఎం రాష్ట్ర నాయకులు టి రాఘవయ్య తెలిపారు. ఆదివారం రూరల్ గ్రామం కంచర్లపాలెం జడలమ్మతల్లి గుడి ఆవరణలో ముగ్గులు, మ్యూజికల్ ఛైర్స్ పోటీలు నిర్వహించారు. సి.ఐ.టి.యు జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబూ ప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయ సంస్కృతిని కాపాడుకునేందుకు కార్మిక, కర్షకుల ఐక్యత ఎంతైనా అవసరమన్నారు. సభాధ్యక్షత వహించిన జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ యువతను చెడు వ్యసనాల నుంచి మరల్చడానికి ఆట, పాటలు దోహదపడతాయన్నారు. షేక్ హుస్సేన్ వలి, చుక్కపల్లి భరత్, గాలి శారదా దేవి, జి భరత్ ములకా శివకుమారి విజేతలకు బహుమతి ప్రధానం చేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న భారతి తదితరులు

ప్రజాశక్తి -పెదనందిపాడు

ఆటలు ఆరోగ్యానికి తొలిమెట్టు అని తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం ట్రస్టు కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు అన్నారు. పాలపర్రులో ఆదివారం ఎస్ ఎఫ్ ఐ, డి వై ఎఫ్ ఐ, ఐద్వా, రైతు సంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటలు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. నడక,లెమన్ అండ్ స్పూన్, స్పీడ్ వాకింగ్, మ్యూజికల్ చైర్, తాడులాగుట, పరుగు పందెం విభాగాలలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు ముగింపు సందర్భంగా జరిగిన సభలో రమేష్ బాబు తదితరులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పెద్దిపాగ ప్రవీణ్, నాయకులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పెదనందిపాడులో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, యువత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని, సిఐటియు, మహిళా సంఘం, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్య నగర్ లో వివిధ రకాల ఆటల పోటీలను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా మహిళలకు స్టార్ మహిళ, బాల్ కొట్టు.. ప్రైజ్ పట్టు ఆటలలో మహిళలు, యువకులు, బాల బాలికలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆటల పోటీలను వలి, నాగరాజు, జగదీష్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి తాడేపల్లి మండల నాయకులు కొట్టే కరుణాకర రావు, సిఐటియు తాడేపల్లి మండల నాయకులు సిహెచ్ భుజంగరావు, పి రామచంద్రరావు, రామారావు, సంఘవి తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకర్

17న విజయవాడలో ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - దుగ్గిరాల

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 17వ తేదీన విజయవాడలో రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకర్ కోరారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకం అమలు జరపాలని పెట్టుబడి సహాయం వెంటనే అందించాలని, రైతులు పండించే పంటకు ఉచిత బీమా ప్రభుత్వమే చేయాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రక్రియను నిలుపుదల చేయాలని, డెల్టా ఆధునీకరణ చేపట్టాలని, రబికి ఎరువులు అందించాలని, శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ లో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. మండల కార్యదర్శి వై బ్రహ్మేశ్వర రావు బి అన్ని రెడ్డి గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

టిడ్కో గృహ సముదాయంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని టిడ్కో గృహ సముదాయములో సంక్రాంతి పండగ సందర్భంగా డిఎన్ఆర్ హాస్పిటల్స్ గుంటూరు హాస్పిటల్ వారిచే ఆదివారం ఆటల పోటీలను నిర్వహించారు. కబడి, కోకో, క్రికెట్, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కాగితాల స్వాతి గౌడ్ అధ్యక్షతన ప్రముఖ వైద్యురాలు పి గిరిజ మాట్లాడుతూ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని కోరారు. కార్యక్రమంలో కే సుష్మ, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, వై నరసింహారావు, రాజ్యలక్ష్మి, ఏ సుబ్బారావు పాల్గొన్నారు. అనంతరం అతిధులకు జ్ఞాపికలను అందజేశారు.

దళిత కాలనీల్లో సమస్యలు కోకొల్లలు

వ్యకాస ఆధ్వర్యంలో సర్వేలో ప్రజల ఏకరువు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

తాడేపల్లి పట్టణ పరిధిలోని ముగ్గురోడ్డు ప్రాంతంలో కొండ పోరంబోకులో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వ్యకాస ఆధ్వర్యంలో ముగ్గురోడ్డులోని దళిత వాడలలో నాయకులు ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఏళ్ల తరబడి కొండ పోరంబోకు స్థలాలలో ఇళ్లు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు ఇప్పటికీ ఇళ్ల పట్టాలను పాలక పక్షాలు మంజూరు చేయకపోవడం అన్యాయమన్నారు. అదేవిధంగా ఒకే ఇంటిలో రెండు మూడు కుటుంబాలు ఇళ్ల స్థలాలు లేక నివాసం ఉంటున్నారని, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇళ్ల పట్టాలు లేనందున, బ్యాంకులలో ఇతర అవసరాలకు రుణాలు మంజూరు కావడం లేదని పేదలు ఆవేదన చెందుతున్నారని ఆయన అన్నారు. అంతేకాకుండా రేషన్ షాపుల ద్వారా ఇచ్చే సరుకులలో కందిపప్పు రెగ్యులర్ గా ఇవ్వాలని పేదలు కోరుతున్నారని అన్నారు. ప్రభుత్వం పేదలకు అవసరమైన నిత్యవసర వస్తువులను రేషన్ డిపోల ద్వారా సరిగా ఇవ్వనందున, అధిక ధరలతో బయట కొనుక్కునే పరిస్థితి లేదన్నారు. అదే విధంగా ముగ్గురోడ్డు ప్రాంతంలో దళిత బాడలలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేనందున పరిసరాలలో వాడిన వ్యర్థపు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి, దోమలు ప్రబలుతున్నాయని, పేదలు జబ్బుల బారిన పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే దళితవాడల్లో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు మంజూరు చేసి, డ్రైనేజీ వ్యవస్థను పటిష్ట పరచాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ సర్వేలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి పట్టణ కార్యదర్శి నీరు డు దుర్గారావు, నాయకులు దర్శనపు విజయ్ బాబు, మన్నం లీలమ్మ, గద్దల గోపమ్మ పాల్గొన్నారు.



ముగ్గురోడ్డులో సర్వే నిర్వహిస్తున్న వ్యకాస నాయకులు ఈమని అప్పారావు



విజేతకు డ్రెస్సింగ్ టేబుల్ అందచేస్తున్న సంఘం నాయకులు

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

స్వామి వివేకానంద జీవితం ఆదర్శంగా తీసుకోవాలి అని టీచర్ గడ్డిపాటి పద్మరాణి అన్నారు. ఆది వారం మండలంలోని చిన్న కొండ్రుపాడులో వేలి వెల్లి లింగయ్య ఉచిత విద్య శిక్షణ కేంద్రంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు భారత దేశ ప్రఖ్యాతి వివేకానంద తెలియజేసారన్నారు. యువతకు స్ఫూర్తి నిచ్చే పుస్తకాలు, యువతారాన్ని ఉత్తేజ పరిచి ఆకర్షించే విధంగా ఉంటాయని, అందుకే జాతీయ యువజన దినోత్సవం జరుపుకుంటారని అన్నారు. చిన్న కొండ్రు పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్య కమిటీ చైర్మన్ పోతురాజు లక్ష్మి నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు స్వామి వివేకానంద జీవిత చరిత్ర లాంటి పుస్తకాల్ని చదవటం అలవాటు చేసుకోవాలన్నారు అనంతరం విద్యార్థులచే వివేకానంద చిత్ర పటానికి నివాళులు అర్పించారు.



వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పద్మరాణి తదితరులు

ఫీజలు చెల్లించలేదని పిల్లల్ని బయట నిలబెడుతున్నారు

'తల్లికి వందనం' జమకాలేదని తల్లిదండ్రుల ఆవేదన

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని మంచికల పూడి గ్రామంలో ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దళితులు జీవన స్థితులు ఆర్థిక పరిస్థితుల మీద సర్వేచేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి పనులు వారం రోజులు కంటే ఎక్కువ జరపటం లేదని, నెలలు గడుస్తున్నా వేతనాలు చెల్లించడం లేదని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ఫీజులు చెల్లించలేదని స్కూల్ యాజమాన్యం పిల్లల్ని బయట నిల్చో పెడుతున్నారని తమ సర్వే తెలిసిందని చెప్పారు.గ్రామంలో డ్రైనేజీ సమస్య కారణంగా అనేక సందర్భాల్లో కోట్లాటలు జరిగాయని, గ్రామంలో ఇంకా నిర్మించాల్సిన రహదారులు ఉన్నాయని చెప్పారు. రైల్వే గేట్ దగ్గర నుండి కె.ఆర్ కొండూరు వరకు వెళ్లే తారు రోడ్డుని పగలగొట్టారని, తిరిగి మళ్లీ దానిని రోడ్డు వేయని కారణంగా దుమ్ములేగిసి ద్విచక్ర వాహనాలు పడిపోయే పరిస్థితి ఉందని వెంటనే రోడ్డును వేయాలని కోరారు. గ్రామంలో ఇళ్లు లేని వారు ఉన్నారని, వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. పింఛను రూ. 4000 నుండి 5000 కు పెంచాలని కోరారు. కార్యక్రమంలో వై స్టాలిన్ వైబ్రేమేశ్వరావు పి ప్రకాష్ రావు ఎంఎస్ పాదం సిహెచ్ సునీల్ పి.ఎలమందయ్య డి.వీరయ్య పాల్గొన్నారు.



దుగ్గిరాల సర్వేలో బాలరాజు తదితరులు

సేవాసంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

శ్రీ చౌడేశ్వరి తొగట వీరక్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పాతగుంటూరు, యాదవా హైస్కూల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు అనంత మల్లికార్జున మాట్లాడుతూ తెలుగు సంస్కతిలో నూతన సంవత్సరంలో వచ్చే పెద్ద పండుగ సంక్రాంతి అని, మూడు రోజులపాటు తెలుగు వారు ఘనంగా జరుపుకునే సంక్రాంతి పండుగకు ముగ్గులు ప్రత్యేక శోభ తీసుకొస్తాయన్నారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి ఎన్.ప్రియాంక, ద్వితీయ బహుమతి సుజిత, తృతీయ బహుమతి టి.నాగలక్ష్మి గెలుచుకున్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు వెనిగండ్ల కోటేశ్వరరావు, కనిగిరి రామారావు, కార్యదర్శి పూజల అర్జున్, మహిళా అధ్యక్షురాలు మాదాసు ఉషారాణి, గుండిగ ఆంతోనిబాబు, శీలం మల్లికార్జున, పట్టం రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



పండగలో కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు : సీఐ భాస్కర్

ప్రజాశక్తి-దాచేపల్లి
సంక్రాంతి పండగ నేపథ్యంలో ఎవరైనా కోడిపందాలు, జూదం, ఇతర చట్టవిరుద్ధమైన కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ భాస్కర్ హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. పండగ సందర్భంగా ఊర్లకు వెళ్లేవారు పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని కోరారు. ఆయా ప్రాంతాలో తగు భద్రత ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. సమావేశంలో ఎస్ఐలు పాపారావు, సౌదర్ రాజన్ పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల సేవానిరతి అభినందనీయం

ప్రజాశక్తి - వినుకొండ
స్థానిక మార్కాపురం రోడ్డులోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఆలయంలో పడిపూజ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ముఖ్య అతిథిగా హాజరై, ఆలయ ధర్మకర్త గుడివాడ చిన్న గురునాథంతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు దిగ్విజయంగా కొనసాగాలని మక్కెన ఆకాంక్షించారు. సంక్రాంతి రోజున అయ్యప్ప స్వామి దేవస్థానంలో మకర జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గురునాథం తెలిపారు.



పేద బ్రాహ్మణులకు నిత్యావసరాల వితరణ

ప్రజాశక్తి - వినుకొండ
బ్రాహ్మణ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు జీవీ మాధవరావు కార్యాలయంలో ఆదివారం పలువురు పేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలు అందజేశారు. చింతలచెర్వు రాఘవేంద్రరావు, దార్వేముల చంద్రశేఖర శాస్త్రి, ఉల్లగంటి మల్లికార్జునరావు, దారా రామమూర్తి తదితరులు సహకారం అందించారు.



జనసేన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వెల్దుర్తి
మండలంలోని ఎర్రబాలెం గ్రామంలో జనసేన పార్టీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ వెల్దుర్తి మండల అధ్యక్షుడు గంధం మల్లయ్య, ఎర్రబాలెం నాయకులు గోనుగుంట్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి వివేకానంద

ప్రజాశక్తి-సత్తెనపల్లి, టౌన్, రూరల్
దేశాభివృద్ధిలో కీలకం యువత అని.. అలాంటి శక్తికి స్ఫూర్తి స్వామి వివేకానంద అని నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. ఆదివారం సత్తెనపల్లి పట్టణంలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద నవ చైతన్య వివేక సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన వివేకానంద జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ విదేశాల్లో ఉన్న భారతీయ యువతను ప్రసంగాలతో, రచనతో ఉత్తేజపరిచారని తెలిపారు. దేశంలో యువత స్వామి వివేకానంద అడుగుజాడల్లో నడుచుకోవాలని సూచించారు.

మాచర్ల రూరల్ : వివేకానందుని రచనలు స్ఫూర్తిదాయకమని గురజాల డిఎస్పి బి.ఎల్.ఎన్.జగదీష్ అన్నారు. వివేకానంద జయంత్యుత్సవాలను పురస్కరించుకొని శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డులోని వివేకానందుని విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డితో కలిసి వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో సేవా సమితి కార్యదర్శి పోలిశెట్టి పుల్లారావు, ఉపాధ్యక్షులు గంద్రకోట శివశంకర్ ప్రసాద్, దగ్గుల కోటిరెడ్డి, కోశాధికారి చింతలపూడి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో..



వివేకానంద విద్యానికేతన్‌లో...

స్వామి వివేకానంద యువతకు ఆదర్శం

పెదకూరపాడు : స్వామి వివేకానంద యువతకు ఆదర్శమని వివేకానంద విద్యాసంస్థల ప్రిన్సిపల్ శిరీష అన్నారు. మండలంలోని 75 తాళ్లూరులోని వివేకానంద విద్యానికేతన్, జూనియర్ కళాశాలలో వివేకానందుని జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు వేశారు. విద్యార్థులు కోలాటం, భజన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆ సంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ

'వీర మహిళలకు ప్రభుత్వంలో తగిన గుర్తింపు'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
పార్టీ కార్యకర్తలు, వీర మహిళలు క్రమశిక్షణతో పని చేస్తే కచ్చితంగా కూటమి ప్రభుత్వంలో గుర్తింపు ఉంటుందని జనసేన నాయకురాలు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లూరు రూప అన్నారు. నరసరావుపేట ఆర్యవైశ్య అన్నదాన నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాలకు ఆమె విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనసేనలో మహిళలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో బలంగా పని చేసేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో గుప్తా శ్రీకాంత్, అద్దేపల్లి ఆనంద్, మిరియాల వెంకటసుబ్బమ్మ, మిరియాల సుబ్బమ్మ, జడా శ్రావణి, జక్కం నిర్మల, అంబటి రేణుక, మల్లీశ్వరి, శ్రావణి, మాధవి, జయలలిత పాల్గొన్నారు.



పేద విద్యార్థులకు చేయూత అందిద్దాం

ప్రజాశక్తి-వినుకొండ
మనం ఇతరులకు ఏం సాయం చేసినా.. ఆ మంచి తిరిగి వస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఆ స్ఫూర్తితోనే 15 రాష్ట్రాల్లో వ్యాపారాలున్నా జన్మభూమి రుణం తీర్చుకోవడానికి పల్నాడు, వినుకొండను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. ఆదివారం గుంటూరు జేకేసీ కాలేజీ రోడ్డులోని కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్‌లో శ్రీ కాకతీయ విద్యార్థి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. తన సంపాదనలో కొంత పేద విద్యార్థుల చదువుకు ఇవ్వాలని విద్యార్థిగా ఉన్నప్పుడే నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులంతా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని, వారూ 10 మందికి సేవ చేయాలన్నదే ఆకాంక్ష అని చెప్పారు. పాఠ్య పుస్తకాలకు అదనంగా వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలకు సంబంధించిన వాటినీ చదవాలన్నారు. తపేద విద్యార్థులకు సేవ చేస్తున్న శ్రీ కాకతీయ విద్యార్థి సంక్షేమ సంఘాన్ని అభినందిస్తున్నట్లు చెప్పారు. ఏటా తన వంతుగా రూ.లక్ష అందిస్తానని చెప్పానని, వచ్చే సంవత్సరం శివశక్తి ఫౌండేషన్ ద్వారా రూ.5 లక్షల అందిస్తామని ఆయన తెలిపారు.



డాక్టర్ నాగరాజుకు థెరిసా అవార్డు


ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
నరసరావుపేటకు చెందిన మా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ స్వర్ణ నాగరాజుకు మదర్‌థెరిసా మెమోరియల్ అవార్డు లభించింది. హైదరాబాద్ హెూలీ స్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ డాక్టర్ నాగరాజు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డును అందజేసి గౌరవించింది. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా నరసరావుపేట పట్టణంలో మా ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా వృద్ధులకు, యాచకులకు అన్నదానం, ఇతర కార్యక్రమాలు చేస్తున్నందుకు యూనివర్సిటీ డైరెక్టర్ ఆనంద్ బాబు, సాయి శ్రీనివాస్ అవార్డును బహూకరించారు.





ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

ప్రజాశక్తి - క్రోసూరు
స్వామి వివేకానంద జయంతిని ఆంధ్ర లీగల్ అసోసియేట్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని వివేకానంద సందేశాన్ని వివరించారు. ఆంధ్ర లీగల్ అసోసియేట్స్ న్యాయవాది నర్రా పిచ్చయ్య మాట్లాడుతూ ఏటా వివేకానంద జయంతిని పండగలా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బిఎల్ చిన్నయ్య, నాయక్, శ్రీదేవి, వడ్లమూడి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా గ్రామోత్సవం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
నరసరావుపేట పట్టణంలోని శ్రీ పట్టాభిరామ స్వామి దేవస్థానంలో స్వామి వారి గ్రామోత్సవాన్ని మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా ఆధ్వర్యంలో ఆదివారం కన్నులపండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని శ్రీ పట్టాభిరామస్వామి వారికి పూజలు నిర్వహించి, గ్రామోత్సవంలో పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-రెంటచింతల
మండలంలోని తుమ్మరకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు మరోసారి కలుసుకుని.. ఆ నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో వారంతా దాదాపు 25 ఏళ్ల తర్వాత మరోసారి కలిసి, నాటి మధురానుభూతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. తమకు విద్యాబుద్ధులను నేర్పించి, ఉన్నతికి కారణమైన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎం.కృష్ణమూర్తి, అబ్దుల్ సలీం, పోట్ల శైలజ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల చేయూత

ప్రజాశక్తి-సత్తెనపల్లి
బోయకాలనీలో అనారోగ్యంతో మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడు చొప్పరపు రామాంజనేయులు మృతికి తోటి కార్మికులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మట్టి ఖర్చుల నిమిత్తం రామాంజనేయులు కుటుంబానికి రూ.10 వేలు అందజేశారు. తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు మహేష్, బాలస్వామి, యలమంద, మరియదాసు, అంకమ్మరావు, సిఐటియు నాయకులు అవ్వారు ప్రసాద్‌రావు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివరావు పాల్గొన్నారు.

గోకులాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - రెంటచింతల
రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మంజూరు చేసిన మినీ గోకులాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా తమ కాళ్ల మీద తాము నిలబడి వృద్ధిలోకి రావాలని మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు గొంటు సుమంత్ రెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రమైన రెంటచింతలతోపాటు రెంటాల గ్రామంలో నిర్మించిన గోకులాలను ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పని చేస్తోందని చెప్పారు.

ఊరూరా సంక్రాంతి సందడి



ప్రజాశక్తి-మంగళగిరి
సంక్రాంతి పండగ నేపథ్యంలో గ్రామగ్రామానా సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఆటలు, ముగ్గుల పోటీలు, వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. మంగళగిరి బాపనయ్య నగర్లో టీడీపీ నాయకులు తోట కరుణ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలకు 82 మంది మహిళలు హాజరై రంగురంగుల ముగ్గుల వేశారు. స్నేహ మహిళా మండలి అధ్యక్షురాలు వల్లభనేని వాణి, డాక్టర్ పి.గిరిజ జడ్జిలుగా వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరుణ కుమార్, మాజీ కౌన్సిలర్లు కొమ్మారెడ్డి నాని, దిడ్ల సత్యానందం, టీడీపీ నాయకులు కోలా శ్రీనివాసరావు, క్రాంతి, రాఘవులు, బూసి గోవిందరాజు, తోట నాగమణి, మాధవి, పద్మ, వీర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.




కబడ్డీ పోటీల్లో పాల్గొన్న బాలికలు



రంగవల్లులు వేస్తున్న మహిళలు

దుగ్గిరాలలో పండగ సందడి

దుగ్గిరాల : సంక్రాంతి పండగ నేపథ్యంలో గ్రామానికి చెందిన దోస్త్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను స్థానిక కాంటినెంటల్ కాఫీ ఫ్యాక్టరీ ఎండీ చల్లా రాజేంద్రప్రసాద్, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి గూడూరు వెంకటరావు ప్రారంభించారు. మండలస్థాయిలో జరిగిన కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో 30 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం మహిళలకు ముగ్గులు, వంటల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బాణా వత్ ఖు షిబాయి, ఇన్చార్జి ఎంపీపీ షేక్ జబీన్, మాజీ ఎంపీపీ వెనిగళ్ల కష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా స్వామి వివేకానంద జయంతి

ప్రజాశక్తి-దుగ్గిరాల
స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను మండలంలోని ఈమని గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని, వివేకానంద జీవిత చరిత్రలోని ముఖ్య అంశాలను వివరించారు. కార్యక్రమంలో కృష్ణ, శ్రీనివాసరావు, ప్రకాశరావు, రమేష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ


ప్రజాశక్తి-తెనాలిరూరల్
కాటూరి ఆర్ట్ గ్యాలరీలో రూపుదిద్దుకున్న సినీనటులు, మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు విగ్రహాన్ని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సోదరుడు రవిబాబు ఆదివారం ఆవిష్కరించారు. తెనాలి పేరు ప్రఖ్యాతలను ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపజేస్తున్న సూర్య శిల్పశాల నిర్వాహకులు కాటూరి వెంకటేశ్వరావు, రవిచంద్ర, హరిష్‌లను ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు.

సినీ జగత్తులో సూపర్ స్టార్

దివంగత నటుడు కృష్ణ విగ్రహావిష్కరణ సభలో మంత్రి నాదెండ్ల



ప్రజాశక్తి-తెనాలి
తన విలక్షణ శైలితో ప్రేక్షకుల మన్ననలు పొందిన కృష్ణ.. సూపర్‌స్టార్‌గా వెలుగొందారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెనాలి బండ్‌పై ఏర్పాటు చేసిన దివంగత నటుడు ఘట్టమనేని కృష్ణ కాంస్య విగ్రహాన్ని ఆదివారం మంత్రి నాదెండ్ల, సినీ నిర్మాత ఘట్టమనేని ఆది శేషగిరిరావు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ.. 50 సంవత్సరాల సుదీర్ఘ సినీ ప్రస్థానంలో సూపర్ స్టార్ ఎన్నో మైలురాళ్లను చేరుకున్నారని గుర్తు చేశారు. ఆదిశేషగిరిరావు, రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సినీ జగత్తులో కొత్త ఆవిష్కరణలకు కృష్ణ ఆద్యుడన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సోదరుడు రవీంద్రబాబు, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, మహేష్‌బాబు సోదరులు ఘట్టమనేని రాఘవ, రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.



గీత కార్మికుల సంక్షేమానికి కృషి ప్రశంసనీయం

ప్రజాశక్తి-మంగళగిరి
జాతీయస్థాయిలో కల్లుగీత కార్మికుల సంక్షేమానికి తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారికి చెందిన జాతీయ నాయకులు రాజా నాడార్ చేసిన కృషి ప్రశంసనీయమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. ఆదివారం మంగళగిరి రాష్ట్ర కార్యాలయానికి రాజా నాడార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను బీసీ సంక్షేమ సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు.

కార్మికుల ఆకలి బాధలు పట్టవా?

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్
కార్మికుల ఆకలి బాధలు ఈ ప్రభుత్వానికి పట్టడం లేదని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు విమర్శించారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ఏసీసీ కార్మికుల రిలే దీక్షలను పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందా? అని ప్రశ్నించారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీనే అమలు చేయాలని మంత్రి నారా లోకేశ్‌ను కోరుతున్నామన్నారు. కార్మికులకునష్టపరిహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దీక్షలలో డి.నాగేశ్వరరావు, ఎం.సాంబశివరావు, ఎస్.కె ఆరిఫ్, సిహెచ్ పిచ్చయ్య, ఎం.గురవయ్య కూర్చున్నారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు



వెంకటేశ్వరరావు మరణం తీరని లోటు


ప్రజాశక్తి మంగళగిరి
ఇటీవల అకాల మరణానికి గురైన బౌద్ధాభిమాని చిలకా వెంకటేశ్వరరావు సంస్మరణ సభ స్థానికంగా ఆదివారం నిర్వహించారు. సభాధ్యక్షులు రేకా కృష్ణార్జున రావు మాట్లాడుతూ పాతికేళ్ల మంగళగిరి బుద్ధవిహార ప్రయాణంలో కీలక పాత్ర నిర్వహించిన చిలకా వెంకటేశ్వర రావు అకాల మరణం తీర్చలేని లోటన్నారు. కార్యక్రమంలో మంగళగిరి సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు, మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు, ప్రజానాట్యమండలి కళాకారులు కంచర్ల కాశయ్య, చేనేత నాయకులు ఆకురాతి రత్నారావు, అల్లక తాతారావు పాల్గొన్నారు.

'అరవింద'లో ముగిసిన సహేస్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్
అరవింద ఎడ్యుకేషనల్ సొసైటీ పూర్వపు డైరెక్టర్ కీర్తిశేషులు చాగంటి చంద్రశేఖర్ రెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మూడు రోజుల సహేస్ ముగింపు కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా సాగింది. విద్యార్థులకు కోలాటం, కథా విశ్లేషణ, థియేటర్, పోటరీ, ఇంగ్లీష్, తెలుగు సృజనాత్మక రచన, సంగీతం, నృత్యం, టింకరింగ్, వంట, ఫన్ సైన్స్, యోగ వంటి అనేక అంశాలపై నైపుణ్యం గల రిసోర్స్ పర్సన్లతో అవగాహన కల్పించారు. 18 పాఠశాలల నుంచి 175 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సాయి అరవింద్ మాట్లాడుతూ ఇతర పాఠశాలల్లో సాధ్యం కాని అంశాలను, మంచి వాతావరణంలో ఆరోగ్యకరమైన ఆహారం, పిల్లల గురించి ఆలోచించే మంచి వ్యక్తుల మధ్య మూడు రోజులు పాటు విద్యార్థులు ఉండటం చాలా ఆనందాన్ని ఇచ్చిందని చెప్పారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు పుస్తకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో విద్యావేత్తలు శివరాం, డాక్టర్ సీఏ ప్రసాద్, శాంతారావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



వేడుకలో భాగంగా విద్యార్థుల కోలాటం



నేటి నుంచి శాంతి సువార్త సభలు

ప్రజాశక్తి-మంగళగిరి
ప్రపంచశాంతి కోరుతూ జీసస్ గాస్పెల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న నుంచి శాంతి సువార్త సభలు ప్రారంభమవుతాయని అసోసియేషన్ అధ్యక్షులు రెవరెండ్ బిషప్ ఆర్.మోషే బాబు తెలిపారు. మంగళగిరి పట్టణంలోని తెనాలి ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు సువార్త పండగలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కులమతాలతో సంబంధం లేకుండా అందరూ పాల్గొనవచ్చని తెలిపారు. మంగళగిరి జేజీఏ డైరెక్టర్ రెవ డాక్టర్ వసంతరావు మాట్లాడుతూ అయిదు రోజులపాటు జరిగే శాంతి సువార్త పండగలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 10 వేల మంది విశ్వాసకులు పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో నందిగం వసంతరావు, పాస్టర్ రావూరి దేవపాల్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ యవజన దినోత్సవం

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : స్థానిక కొత్తపేట శ్రీ రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం షేక్ మౌలాబి మాట్లాడుతూ భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటిన మహనీయుడు వివేకానంద అని అన్నారు.



ముగిసిన క్రికెట్ లీగ్ పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్
ఎంటిఎంసి పరిధిలోని ఉండవల్లి గ్రామంలో ఆరు రోజులుగా సాగిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. చివరిరోజు సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. ఫైనల్ మ్యాచ్‌లో నరసింహా సీసీ- ఫ్యాక్టరీ సీసీ జట్లు తలపడగా.. నరసింహా సీసీ జట్టు అద్భుత విజయం సాధించింది. తాడేపల్లి సూపర్ లీగ్ టెన్నిస్ బాల్ టోర్నమెంట్ ఛాంపియన్‌గా నిలిచింది. రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, చిల్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ పార్టీ నాయకులు జొన్న రాజేష్, గాదె వినయ్ తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ స్క్వాడ్ సెలక్షన్స్‌కు ప్రణవి సాయి ఎంపిక



ప్రజాశక్తి-గుంటూరు

ది నేషనల్ హైప్లేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భోపాల్‌లో జరిగిన 67వ రైఫిల్ నేషనల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో ద ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్‌కు చెందిన గంగిశెట్టి ప్రణవి సాయి ఉత్తమ ప్రతిభ చూపి ఇండియా షూటింగ్ టీమ్ స్క్వాడ్‌కు ఎంపిక అయ్యిందని అకాడమీ డైరెక్టర్, చీఫ్ కోచ్ నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రణవిసాయి పది మీటర్ల ఎయిర్ రైఫిల్ పీస్‌సెట్ ఈవెంట్‌లో 614.5 పాయింట్ సాధించి, 2025లో జరిగే స్క్వాడ్ సెలక్షన్ ట్రయల్స్‌లో యూత్, జూనియర్, సీనియర్ ఉమెన్ క్యాటగిరీలలో అర్హత సాధించిందన్నారు.

31న విజ్ఞాన్స్ వర్సిటీలో బాలమహోత్సవ్

ప్రజాశక్తి-గుంటూరు



బాలమహోత్సవ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న లావు రత్తయ్య, వీసీ నాగభూషణం తదితరులు

విజ్ఞాన్స్ యూనివర్సిటీలో చిన్నారుల కోసం మొట్టమొదటి సారిగా రాష్ట్రస్థాయి బాలమహోత్సవ్ కార్యక్రమాన్ని జనవరి 31 నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామని వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగ భూషణ్ తెలిపారు. ఆది వారం యూనివర్సిటీలో చిన్నారుల పండుగ 'విజ్ఞాన్ బాల మహోత్సవ్' పోస్టర్లను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శించుకునేందుకు విజ్ఞాన్ బాల మహోత్సవ్ వేదికగా నిలిస్తుందన్నారు. ఈ మహోత్సవంలో 50 ఈవెంట్లలో పోటీలు నిర్వహిస్తామన్నారు. 5 నుండి 7వ తరగతి వరకూ జూనియర్స్ విభాగం, 8 నుండి 10వ తరగతి వరకూ సీనియర్స్ విభాగంగా వేర్వేరుగా పోటీలు ఉంటాయన్నారు. కావున తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించి పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు www.vignan.ac.in/balamahotsav వెబ్‌సైట్‌ను సందర్శించి కూడా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'మట్టి మనిషి'

ముగిసిన గుంటూరు కళాపరిషత్ నాటకోత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు



జ్యోతిప్రజ్వల కార్యక్రమంలో పెనుగొండ లక్ష్మీనారాయణ తదితరులు

రైతు భూమిని నమ్ముకోకుండా అమ్ముకుంటే ఎదురయ్యే దుష్ఫలితాలకు 'మట్టిమనిషి' నాటకం అద్దం పట్టింది. గుంటూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో జరుగు తున్న నాటకోత్సవాలలో భాగంగా చివరి రోజు ప్రదర్శనగా మిత్రా క్రియేషన్స్ హైదరాబాద్ వారిచే మట్టిమనిషి నాటకం ప్రేక్షకుల్ని ఆలోచింప చేసింది. డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి రాసిన మూలకథకు వల్లూరు శివప్రసాద్ నాటకీకరణ చేయగా, ఎస్.ఎం.భాషా దర్శకత్వం వహించారు. 1970లో మట్టిమనిషి నవల ఆంధ్రపత్రిక అనుబందంలో సీరియల్‌గా ప్రచురించారు. 1995 నుండి 2000 సంవత్సరం కాలంలో ఉస్మానియా యూనివర్సిటీ వారు ఎంఎ చివరి సంవత్సరం విద్యార్థులకు పాఠ్యాంశంగా బోధించారు. నేషనల్ బుక్‌ట్రస్ట్ ఇండియా వారు 14 భాషలలోకి అనువదించి ప్రచురించారు. తెలుగు సాహిత్యంలో గొప్ప రచనల్లో 'మట్టి మనిషి' 13వ రచనగా పేరొందింది. ఇంత గొప్ప చరిత్ర కలిగిన నవల ఆధారంగా తయారు చేసిన ఈ నాటకాన్ని చూసి ప్రేక్షకులు గొప్ప అనుభూతికి లోనయ్యారు. తొలుత జరిగిన సభా కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ జ్యోతిప్రజ్వలన అనంతరం మాట్లాడుతూ పాలకులు సాంస్కృతిక స్థాయిని పెంచుకున్నప్పుడే నాటక రంగం మరింత ప్రజ్వరిల్లుతుందని చెప్పారు. పండుగ రోజుల్లోనూ నాటకాలకు సుదూర ప్రాంతాల నుండి తరలి రావటం నాటకానికి ఉన్న ఆదరణను తెలియజేస్తుందన్నారు. ఆలోకం పెద్దబ్బయ్య అధ్యక్షతన జరిగిన సభలో సినీ పాత్రికేయులు రెంటాల జయదేవ్ మాట్లాడుతూ తమిళనాడు, కర్నాటక మాదిరిగి తెలుగు రాష్ట్రాల్లో నాటక రంగం మరింత ముందుకెళ్లటానికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి బి.పూర్ణ తదితరులు ప్రసంగించారు.

నాగభూషణం నటనా ప్రస్థానంపై సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు



నాగభూషణం సంచిక ఆవిష్కరిస్తున్న ముత్తవరపు సురేష్ తదితరులు

గుంటూరు కళాపరిషత్ 27వ వార్షిక నాటకోత్సవాలలో భాగంగా ఆదివారం వేదిక, గుంటూరు కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో వెంకటేశ్వరా విజ్ఞాన మదిరంలో ప్రజా నటులు నాగభూషణం నట ప్రస్తానంపై సదస్సు నిర్వహించారు. గుంటూరు కళాపరిషత్ గౌరవ సలహాదారు ఆలోకం పెద్దబ్బయ్య అధ్యక్షతన జరిగిన సభలో వేదిక అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు పాల్గొని మాట్లాడుతూ 'నాగభూషణం-ప్రజానాట్యమండలి' అనే అంశంపై మాట్లాడారు. ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు 'నాగభూషణం-నాటక రంగం' అనే అంశంపై, నాటక రచయిత కందిమళ్ల సాంబశివరావు ' నాగభూషణం-సినిమా రంగం' గురించి ప్రసంగించారు. సభలో సినీ పాత్రికేయులు రెంటాల జయదేవ్, నాగభూషణం పెద్దకుమారుడు చుండి రాఘవరావు, కళాపరిషత్ అధ్యక్షులు పి.వి.మల్లిఖార్జునరావు, వి.తాండవకృష్ణ, నాయుడుగోపి, బి.పూర్ణ, జి.నాగేశ్వరరావు, పి.శివరామకృష్ణ, రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ' రక్తకన్నీరు నాగభూషణం ప్రజాకళాప్రస్తానం' అనే సంచిక ఆవిష్కరించారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిరోధిస్తాం : ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు, పేకాట, గుండాట, మట్కా ఆడటం, ఆడించడటం చట్టరీత్యా నేరమని వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ తెలిపారు. సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా తెలుగు వారి సంస్కృతిని మేళవించేలా జరుపుకోవాలని ఆయన కోరారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలైన కోడి పందేలు, జూదం, మట్కా వంటి ఆటలు ఆడటం వలన సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో కొంతమంది ప్రజలు పందేలు కాసి తమ కష్టార్జితాన్ని నష్టపోతున్నారని తెలిపారు. కనుక జిల్లాలో కోడిపందేలు, జూదం నిర్వహించకుండా ప్రజా ప్రయోజనాల దష్ట్యా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డ్రోన్ కెమెరాలు సిసి కెమెరాలు సహాయంతో గతంలో కోడిపందాలు, పేకాట, మట్కా నిర్వహించిన ప్రదేశాలపై, నిర్వాహకులపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఎవరైనా జిల్లాలో జూద శిబిరాలు నిర్వహించినా, కోడిపందాలు నిర్వహించినా, పందేలు నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చినా, కోళ్ళకు కత్తులు కట్టినా, వాటిని తయారు చేసినా,సరఫరా చేసినా వారిపియా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి సెలవులకు ఊర్లకు, విహార యాత్రలకు వెళ్లేవారు తమ ఆస్తులను, ఇళ్లను భద్రంగా కాపాడుకోవడానికి పోలీస్ శాఖ వారు అందించే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఇంటిలో బంగారం, వెండి ఆభరణాలు ఇతర విలువైన వస్తువులు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో, లేదా ఇతర సురక్షితమైన ప్రదేశాలలో భద్రపరుచుకోవాలని సూచించారు. దొంగతనాలను అరికట్టుటలో, అవాంఛనీయ ఘటనలు నివారించడంలో, కోడిపందాలు, పేకాట, ఇతర జూద క్రీడలను అరికట్టడంలో ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్య కలాపాలు జరుగు తున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓకి (లేదా) డయల్ 112 కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

హక్కుల రక్షణ కోసం కెఎస్‌ను గెలిపించుకోవాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు



ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల హక్కులు కాపాడు కోవడానికి కృష్ణ-గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా కెఎస్ లక్ష్మణరావుని గెలిపించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం యూటీఎఫ్ గుంటూరు జిల్లా కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యు.రాజశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన సంఘం సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడారు. 2007లో శాసన మండలి పునరుద్ధరించిన నాటి నుంచి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రజల పక్షాన నిలబడుతూ, మండలిలో, బయటా ప్రజాతంత్ర ఉద్యమాలకు అండగా నిలుస్తున్నారని, ప్రజల హక్కుల కోసం పోరాడుతున్నారని తెలిపారు. నిజాయితీకి నిలువుటద్దంగా, ప్రజాసేవకే అంకితం అయిన అభ్యర్థి లక్ష్మణరావు అన్నారు. లక్ష్మణరావు గెలుపు ప్రజలందరి గెలుపు అని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ కార్యకర్తలు ప్రణాళికా బద్ధంగా ప్రచారం చేసి కెఎస్ లక్ష్మణరావు విజయానికి కృషి చేయాలని కోరారు. రాజ్యాంగం పట్టభద్రులు, టీచర్ల ప్రాతినిధ్యం కోసం కేటాయించిన ఎమ్మెల్సీ స్థానాల్లో ప్రత్యక్ష రాజకీయాలు జొప్పించటం సరికాదన్నారు. ప్రజాతంత్ర హక్కులని కాపాడే కెఎస్ లక్ష్మణ రావుకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు. యుటిఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్, ఎం.కళాధర్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, ఇతర ప్రజా సంఘాల అభ్యర్థిగా పోటీ చేస్తున్న కెఎస్ లక్ష్మణరావు గెలుపు కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా సహఅధ్యక్షులు వై.నాగమణి, కోశాధికారి దౌల్, కార్యదర్శులు, సిహెచ్.ఆదినారాయణ, బి.ప్రసాదు, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి జిఎంసి సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మునిసిపల్ క్రీడా ప్రాంగణంలో జరుగు తున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం రెండోరోజు ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు విఐపిలకు పూర్ణకుంభ స్వాగతం, సన్నాయి మేళం, భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల ఆటపాటలు, ఫుడ్‌స్టాల్స్ ప్రారంభం అవుతాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే చిన్నారులకు బోగిపళ్లు, తాడులాగుట, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్ పోటీలు జరుగుతాయని, సాయంత్రం 5 గంటల నుండి 10 గంటల వరకు డప్పు వాయిద్యం, తంబోలా, సాంప్రదాయ వస్త్రపోటీలు (మహిళలు, చిన్న పిల్లలకు), చెక్కభజన, కూచిపూడి, ఫోక్ డ్యాన్స్ ప్రదర్శనలు ఉంటాయన్నారు. కావున ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేటి జిఎంసి గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి-గుంటూరు : భోగి పండుగ సందర్భంగా సోమవారం జిఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగే డయల్ యువర్, గ్రీవెన్స్ కార్యక్రమాలు రద్దు అయినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున నగర ప్రజలు ఈ విషయాన్ని గ్రహించి సహకరించాలని కోరారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

భవన నిర్మాణ కార్మికులకు రిజిస్ట్రేషన్లు తప్పనిసరి

ఈ - శ్రమ కార్డులుంటే పలు సదుపాయాలు - బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే భారీ జరిమానా

ప్రజాశక్తితో కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎ.గాయత్రీదేవి



ఎ.గాయత్రీ దేవి

కార్మికుల సంక్షేమానికి పలు పథకాలు అమలు చేస్తున్నట్టు కార్మిక శాఖ ఉమ్మడి జిల్లా ఉప కమిషనర్ ఎ.గాయత్రీ దేవి తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు ఉన్న సౌకర్యాలను అమలు చేసేందుకు వారు తప్పని సరిగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. దుకా ణాలు, వ్యాపార సంస్థలు, కర్మాగారాల్లో బాల కార్మికులను పనులో పెట్టుకుంటే సంబంధిత సంస్థలపై కేసులు నమోదు చేస్తామని, భారీ జరిమానాలు విధిస్తామని ఆమె వెల్లడించారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు తెలియజేశారు.



భవన నిర్మాణ కార్మికులు ఎంత మంది నమోదయ్యారు?

జిల్లాలో ఇప్పటి వరకు 2.49 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఇంకా నమోదు చేసుకోని వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. రూ.110 చెల్లించి ఐదేళ్ల పాటు కార్మికులుగా రిజిస్ట్రేషన్ కొనసాగించవచ్చు. ఆ తరువాత ఏటా రూ.12 చెల్లిస్తే సరిపోతుంది.

భవన నిర్మాణకార్మికులకు అందుతున్న సదుపాయాలు?

కార్మికునిగా నమోదు అయిన వారికి ప్రమాదంలో మరణిస్తే రూ.5 లక్షలు, వైకల్యం చెందితే రూ.2లక్షలకు పైగా సాయం అందుతుంది. అంతేగాక సంబంధిత సంస్థ వారు కూడా అదనపు పరిహారం ఇచ్చే అవకాశం ఉంది. సాదారణ మరణానికి రూ.60 వేలు, మట్టిఖర్చులకు రూ.20 వేలు ఇస్తాం. భార్య కాన్పు జరిగితే రూ.20 వేలు ఇద్దరు పిల్లల వరకు పొందవచ్చు. అలాగే కుమార్తెల వివాహం, వారికి డెలివరీ ఖర్చు రూ.20 వేల చొప్పున ఇస్తారు. పిల్లల చదువులకు కూడా రూ.2లక్షల వరకు ఆర్థిక సాయం ఇస్తారు.

బాలకార్మికుల నిరోధానికి తీసుకుంటున్న చర్యలు?

జిల్లాలో బాలకార్మికులను గుర్తించేందుకు వివిధ శాఖల సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు చేస్తున్నాం. ఇందుకు పోలీసుల సహాకారం కూడా తీసుకుంటున్నాం. ప్రధానంగా బాలకార్మికులను పనుల్లో పెట్టుకుంటే వారిపై కేసు నమోదు చేయడంతో పాటు భారీగా జరిమానా విధిస్తున్నాం. ఇప్పటికే వట్టిచెరకూరు, మేడికొండూరు, దుగ్గిరాల మండలాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పూర్తి స్థాయిలో తనిఖీలు చేపట్టాం.

ఈ-శ్రమ పోర్టల్‌లో ఎంత మంది నమోదయ్యారు?

అసంఘటితరంగంలో పనిచేస్తున్న కార్మికలకు కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ పోర్టల్ రూపొందించింది. ఇప్పటి వరకు ఈ శ్రమ పోర్టల్‌లో 6.46 లక్షల మంది నమోదు అయ్యారు. ఈఎస్‌ఐ, పిఎఫ్ పొందని కార్మికులు ఎవరైనా ఈ శ్రమలో నమోదు కావచ్చు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఈ శ్రమలో నమోదు అయి ఉన్న వారు ప్రమాదంలో మృతి చెందితే రూ.2లక్షలు, వైకల్యం పొందితే రూ.లక్ష వరకు ప్రభుత్వం సాయం అందిస్తుంది. వివిధ రంగాల్లోపనిచేస్తున్న 18 నుంచి 59 ఏళ్లలోపు వారు ఎవరైనా తమ పేర్లు కార్మిక శాఖ కార్యాలయాలలో నమోదు చేసుకోవచ్చు.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి